క్లుప్తంగా

రహస్యంగా నకిలీ విత్తనాల విక్రయం

మరికల్: మండల కేంద్రంలో కొందరు వ్యక్తులు రహస్యంగా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేపట్టారు. ఆంధ్రకు చెందిన ఓ వ్యాపారితో మరికల్‌కు చెందిన కొందరు వ్యక్తులు చేతులు కలిపి కర్ణాటక, ఆంధ్ర నుంచి ప్రభుత్వ అనుమతి లేని నకిలీ పత్తి విత్తనాలను తెప్పించి పలు గ్రామాల్లోని రైతులకు రహస్యంగా బైక్‌లపై వెళ్లి విక్రయాలు చేపడుతున్నారు. ఒక కేజీ నకిలీ విత్తనాలు రూ.1,500 విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యాపారం నెల రోజుల నుంచి జరుగుతున్నా టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ అధికారులకు కన్పించడం లేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. నకిలీ పత్తి విత్తనాల వ్యాపారులపై దాడులు నిర్వహిస్తే అసలు గుట్టు బయటకు వచ్చే అవకాశం ఉంది.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకొందాం

మరికల్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చే పదేళ్లు పూర్తి చేసుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం తల్లపెట్టిన దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు మండల బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధం కావాలని మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాలతో ఈ ఘనకీర్తిని ప్రజలకు తెలిజేసేందుకు జూన్ 2 నుంచి మూడు వారాల పాటు జరిగే దశాబ్ది ఉత్సవాలకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అప్పంపల్లి అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, శేఖర్, కొండయ్య పాల్గొన్నారు.

యాదవ సంఘం ఎన్నిక



ధన్వాడ: మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఎన్నికల అధికారి గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పంది రఘువీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ధన్వాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నిక ప్రతిని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా రాంచంద్రయ్య, కార్యదర్శిగా గొల్ల నర్సిములు, డైరెక్టర్లుగా అనురాధ, కవలి వెంకటయ్య, కిష్టాపురం వెంకటయ్య, కురుమూర్తి, బాలప్ప, లక్ష్మమ్మ ఎన్నికయ్యారు.

కర్ణాటక ఎమ్మెల్యే బోసురాజుకు సన్మానం

మక్తల్: కర్ణాటక రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో భాగంగా బోసు రాజుకు మంత్రి వర్గంలో చోటుదక్కింది. ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్న బోసురాజును కాంగ్రెస్ మక్తల్ మండల నాయకులు శనివారం సన్మానించారు. కర్ణాటక వెళ్లి ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములు, రవికుమార్, గణేష్‌కుమార్, నూరోద్దీన్, రవికుమార్, కల్లూరి గోవర్ధన్, రాజేందర్, ఓబులేస్ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ బదిలీ

ఊట్కూరు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ విజయ్‌కుమార్ శనివారం ధన్వాడ హాస్టల్‌కు బదిలీ అయ్యారు. మక్తల్‌లోని ఆనంద నిలయంలో విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి ఊట్కూరుకు బదిలీ అయ్యారు. దీంతో శనివారం వార్డెన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన వార్డెన్‌ను సన్మానించారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

నారాయణపేట రూరల్: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందించాలని కోటకొండలో సర్పంచ్ విజయలక్ష్మికి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎదురింటి నర్సింహులు మాట్లాడుతూ.. జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, వారం తప్ప సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, సాయిలు, కిష్టప్ప, భారతమ్మ పాల్గొన్నారు.

తగ్గిన పత్తి ధర: ఆందోళనలో రైతులు



మరికల్: పత్తి ధర మరింత తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలు పెరిగే అవకాశం ఉందని ఇళ్లలో పత్తి నిల్వ చేసిన రైతుల పాలిట దిగి వచ్చిన ధరలు శాపంగా మారాయి. 15 రోజుల క్రితం రూ.7,500 ధర ఉండగా.. ప్రస్తుతం రూ.6,500కు పడిపోయింది. రోజురోజుకూ పత్తి ధరలు పతనం అవుతుంటే ఇళ్లల్లో నిల్వ చేసిన రైతులు పంటలకు పెట్టిన పెటుబడులు రాని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. మరికొంత మంది రైతులు వచ్చే కొత్త పత్తితో కలిపి అమ్ముకునేందుకు ఆలోచన చేస్తున్నారు. గత వానాకాలం సాగు చేసిన పత్తికి మార్కెట్‌లో ఎప్పటికప్పుడు ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

డ్రెయినేజీల కబ్జాలను పట్టించుకోరా?

- డ్రెయినేజీలపై అక్రమంగా మెట్ల కట్టడాలు
- మురుగు తొలగించేందుకు తీవ్ర ఇబ్బందులు
- దుర్వాసన వెదజల్లుతున్న డ్రెయినేజీలు
- పట్టించుకోని అధికారులు



సత్యనారాయణ చౌరస్తాలో అక్రమంగా నిర్మాణం చేసిన కట్టడాలు



యాట్గీర్‌రోడ్‌లో దుకాణాల ఎదుట..

నారాయణపేట టౌన్: మున్సిపాలిటీ వెయ్యికి పైగా వ్యాపార, వాణిజ్య సముదాయాలతో శరవేంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అక్రమణలు కూడా అంతే వేగంగా పెరుగుతున్నాయి. అక్రమార్కులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దుకాణదారులు, అపార్ట్‌మెంట్ ఇతర నిర్మాణాలు తమ ఇళ్ల మెట్లను సైతం డ్రెయినేజీలపై నిర్మిస్తున్నా అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రెయినేజీల్లో మురుగు, మట్టి పూడికతీత తొలగించేందుకు కూడా వీలు లేకుండా పోయిందని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అక్రమంగా డ్రెయినేజీలపై అక్రమ కట్టడాల వల్ల మురుగు నీరు పారకుండా అక్కడే నిలిచిపోయింది. దీంతో పారిశుద్ధ్య కార్మికులు వాటిని తొలగించేందుకు నానా అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. పట్టణంలో ఇళ్ల ఎదుట నిర్మించిన డ్రెయినేజీపై అక్రమంగా ప్రహారీలు, మరుగుదొడ్లు వంటి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ కట్టడాల వల్ల డ్రెయినేజీల్లో పేర్కొనిపోయిన చెత్తా చెదారం, ప్లాస్టిక్ వర్థ్యాలు, ఇతర మట్టి తొలగించడంతో పారిశుద్ధ్య కార్మికులు విఫలమవుతున్నారు. పట్టణ పరిధిలోని పళ్ల, శాతాహవాహన కాలనీ, సివిల్‌లైన్ రోడ్డు, మొయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో ఈ ఆక్రమణలు అధికంగా కనిపిస్తోంది. డ్రెయినేజీలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలు తొలగిస్తే మురుగు సాఫీగా పారే అవకాశం ఉందని, వెంటనే సంబంధిత అధికారులు దృష్టి సారించి అక్రమ కట్టడాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు

నారాయణపేట టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామరావు శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఓంప్రకాశ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు చౌక్ బజార్, సత్యనారాయణ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించడంతో పాటు ప్రభుత్వ చిన్న పిల్లల ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ ఉంటుందని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

టిప్పర్, డీసీఎం ఢీ: తప్పిన ప్రమాదం



దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్, నారాయణపేట సరిహద్దు ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున టిప్పర్, డీసీఎం ఢీకొన్నాయి. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారి పాత ఇనున సామానును డీసీఎంలో పరిగికి తరలిస్తుండగా దామరగిద్ద వైపు నుంచి వస్తున్న టిప్పర్ తెల్లవారుజామున 3 గంటలకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో డీసీఎం బోల్తా పడింది. డీసీఎం డ్రైవర్ ఎడమ చేతికి చిన్న గాయం కాగా ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో డీసీఎం యజమాని నారాయపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కల్వర్టుకు మరమ్మతు చేయాలి



మరికల్: పదేళ్ల నుంచి మరమ్మతుకు నోచుకోని కల్వర్టులను మరమ్మతు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కన్మనూర్, గాజులయ్యతండాల మధ్య కెనాల్‌పై నిర్మించిన కల్వర్టు వాహనాల రాకపోకలకు ధ్వంసమైంది. ఇక్కడ వాహనాలు అదుపు తప్పితే దాదాపు 50 అడుగుల కెనాల్‌లోకి పడిపోవాల్సిందే. ఈ కల్వర్టుకు ఓ పక్క ధ్వంసమైన రక్షణ గోడను తిరిగి మరమ్మతు చేయాలని పలుమార్లు ఇరువురు గ్రామస్తులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యువతిపై లైంగికదాడికి యత్నం

మరికల్: యువతిపై వరుసకు మామ అయ్యే వ్యక్తి లైంగికదాడికి యత్నించిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యువతి రాత్రి 7 గంటలకు చికెన్ కోసం రోడ్డుపైకి వచ్చింది. తీసుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో వరుసకు మామ అయిన చిన్న కృష్ణయ్య ఇంటి వద్ద దించుతానని చెప్పి బైక్‌పై ఎక్కించుకున్నాడు. ఇంటి వద్ద దించకుండా నేరుగా మాధవరం రోడ్డు వైపు వెళ్లాడు. ఆమె కేకలు వేసినా బైక్ ఆపకుండా వెళ్లగా, స్పీడ్ బ్రేకర్స్ వద్ద బైక్ మెల్లగా పోవడంతో వెంటనే దూకి తప్పించుకొని ఇంటికి వచ్చి విషయం తల్లిదండ్రులకు వివరించింది. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నర్వ: మండలంలోని కుమార్‌లింగంపల్లికి చెందిన కురువ శేఖర్‌కు రూ. 26 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు బాధితుడికి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి చెక్కు అందజేశాడు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, సర్పంచ్ అరవింద్‌కుమార్‌రెడ్డి, విండో డైరెక్టర్లు పల్లెశేఖర్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు గురుకుల విద్యార్థుల ఎంపిక



నారాయణపేట జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో భాగంగా ఈ నెల 28 నుంచి 31వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న పోటీలకు కొండాపూర్ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న 8 మంది ఫుట్‌బాల్‌కు, 9 మంది రెజ్లింగ్ క్రీడాకారులు ఎంపికయ్యారు. మొత్తం 19 మంది క్రీడాకారులు నారాయణపేట జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నారని కొండాపూర్ గిరిజన గురుకుల ఫిజికల్ డైరెక్టర్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌రావు, ఉపాధ్యాయులు విద్యార్థులు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

ధన్వాడ పాఠశాల నుంచి..

ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఖోఖో పోటీలకు అంబిక, సింధు, భవ్యశ్రీ ఎంపికవడంపై హెచ్ఎం రమేష్, మాజీ వైస్ ఎంపీపీ రాంచంద్రయ్య విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ బాల్‌రాజు, శ్రీనివాసులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దామని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంది పల్లిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలోనే గొప్ప మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. బాల్యం నుంచి వివక్షను ఎదుర్కొంటూ దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అని పేర్కొన్నారు. సమాజంలో అంటరానితనం నిర్మూలను ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బోధించు, సమీకరించు, పోరాడు.. అనే నినాదంతో ప్రతి అంబేడ్కర్ వాది పనిచేయాలని పిలుపునిచ్చారు. విగ్రహ ఆవిష్కరణకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, విగ్రహదాత కార్తిక్, ఉపాధ్యాయులు సూర్యచంద్ర, తిమ్మప్ప, నాయకులు యాంకి నాగేష్, శంకర్, నర్సింహులు, ప్రశాంత్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

బస్సుల రద్దు సమంజసం కాదు



డీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: తమకు నచ్చినపుడు బస్సులు నడిపిస్తూ, ఇష్టారీతిగా రద్దు చేయడం ఆర్టీసీ అధికారులకు తగదని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి విమర్శించారు. పది రోజులుగా కోటకొండ రూట్‌లో ఒక్క బస్సు సైతం రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తు పీఓడబ్ల్యూ, పీవైఎల్, సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా తదితర సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ డీఎం ఆంజనేయులుకు శనివారం రాత్రి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో కోస్గి, నారాయణపేట డిపోలకు చెందిన రెండు బస్సులు మూడు ట్రిప్పుల చొప్పున ప్రతి రెండు గంటలకు ఒకసారి తిరుగుతుండేవని, ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ పూర్తిగా బస్సులు రాకుండా చేశారని వాపోయారు. పాలమూర్ డిపో నుంచి ఎన్నో బస్సులు వస్తున్నా కోయిలకొండ, మహబూబ్‌నగర్ రూట్‌లో మాత్రం 'పేట' డిపో అధికారులు సర్వీసు వేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బస్సును పునరుద్ధరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి, హాజి, సలీం, ఇస్మాయిల్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మరికల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నర్సన్‌గౌడ్ అన్నారు. మరికల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకోసం బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ తిరుపతిరెడ్డి, బసిరెడ్డి, శ్రీరామ్, వేణు పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం..

దామరగిద్ద: గత ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావునామాజీ ఆరోపించారు. శనివారం మండలంలోని అన్నాసాగర్‌లో మండల అధ్యక్షుడు సత్యనారాయణ సమక్షంలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వంటి పథకాలను అమలు చేయలేదన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అబద్దాలతో ప్రజలను మోసం చేస్తుందని ఎద్దేవా చేశారు. ఇకపై ప్రజలు సహించే స్థితిలో లేరన్నారు. కొత్తగా పార్టీలో చేరిన మహిళలను కండువాలతో సత్కరించి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌వర్ధన్, గోపాల్‌రావు, మోహన్ నాయక్, సంజీవగౌడ్, అంజిలయ్యగౌడ్, శ్రీనివాస్, ఎంపీటీసీ అంజిలప్ప, ఈరప్ప, అంజి పాల్గొన్నారు.

మద్దూరు: గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్ కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలో మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వ భూములు విక్రయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి పాలనను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మదన్, పార్టీ మండల నాయకులు శంకర్, సాయిలు, రవికుమార్, భరత్, లింగారెడ్డి ఉన్నారు.

నకిలీ విత్తనాలపై ముమ్మర తనిఖీలు

నారాయణపేట రూరల్: ముందస్తు పక్కా సమాచారంతో పట్టణంలో పోలీసులు శనివారం నిర్వహించిన దాడుల్లో కల్తీ విత్తనాలు పట్టుబడ్డాయి. సీఐ రవిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రైతులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ–2 చంద్రశేఖర్‌ను అప్రమత్తం చేయగా, ఆయన జిల్లా కేంద్రంలోని గౌరీశంకర్ ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విడి విత్తనాలను అమ్మకానికి ఉంచారు. వాటిని పరిశీలిస్తే కల్తీ విత్తనాలుగా గుర్తించారు. వెంటనే 76కిలోల తెల్లకందులు, 64కిలోల పెసలు, 101కిలోల ఎర్రకందులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారి క్రాంతిప్రదీప్ పంచనామా మేరకు దుకాణ యజమాని మాణిక్యం రాఘవేందర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. నకిలి విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు తెలియజేయాలని కోరారు.

కృష్ణా: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎస్ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కర్ణాటక నుంచి ట్రేన్‌లో నకిలీ పత్తి విత్తనాలు ఈ ప్రాంతంలోకి తీసుకురాకుండగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు గుర్తింపు పొందిన దుకాణాల నుంచి మాత్రమే పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

చిన్నతనం నుంచే కళలపై ఆసక్తి పెంచాలి



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు

నారాయణపేట రూరల్: చిన్నతనం నుంచే పిల్లలకు కళలపై మక్కువ పెంపొందించాలని టీవీ రేడియో గాయకులు సంగ నర్సింహులు అన్నారు. శనివారం స్థానిక బాలకేంద్రంలో దేశ తొలి ప్రధాని చాచా నెహ్రూ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలంటే అమితమైన ఇష్టం కలిగిన నెహ్రూ బాలకేంద్రం స్థాపనలో ఎంతో కృషి ఉందన్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కల్గిన బాలకేంద్రంలో పిల్లలకు సితార్, గాత్రం, చిత్రలేఖనం తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు వేసవి క్యాంప్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, ఎస్పీ బాలు ఫ్యాన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం ద్వారానే సాధించుకుంటాం

నారాయణపేట రూరల్: కోటకొండను మండలంగా ప్రకటించే వరకు ఉద్యమం ఆగదని పీవైఎల్ జిల్లా నాయకులు సలీం స్పష్టం చేశారు. మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శనివారం ట్రాక్టర్ యునియన్ నాయకులు దీక్షలో కూర్చోగా, ఆయన దీక్షను ప్రారంభించి మాట్లాడారు. వెనకబడిన ప్రాంతంగా మిగిలిపోయిన కోటకొండను మండలంగా మార్చి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి, ఎంపీటీసీ అనసూయ, నాయకులు కెంచె శ్రీనివాసులు, కాశీనాథ్, యాదగిరి, బలరాం, ఎడ్లరాజు, ప్రవీణ్, నర్సింహులు, సౌజన్య, చెన్నప్ప, ట్రాక్టర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రామాలయానికి రూ.4లక్షల విరాళం



నారాయణపేట రూరల్: మండలంలోని అప్పిరెడ్డిపల్లి శివారులోని గుట్టపై పునర్నిర్మిస్తున్న శ్రీసీతారాముల ఆలయానికి లలితమ్మ, బాలకిష్టయ్యగౌడ్, అనిల్‌గౌడ్ కుటుంబ సభ్యులు రూ.4లక్షల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు శనివారం ఆలయ కమిటీ సభ్యులను కలిసి చెక్కు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభావతి, ఎంపీటీసీ జయలక్ష్మి, గ్రామ పెద్దలు సుభాన్‌రెడ్డి, విశ్వనాథ్, శంకర్, బాలప్ప, రంగారెడ్డి, బాలవర్ధన్, దస్తప్ప, మాణిక్యప్ప, ప్రతాప్, సంజీవ్‌రెడ్డి, సిద్దప్ప పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో చోరీ

మక్తల్: పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మధుసూదన్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తు చోరీకి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పర్వతాలు తెలిపిన వివరాల ప్రకారం ఇంటి యజమాని శుక్రవారం ఇంటికి తాళం వేసి వివిధ పనుల నిమిత్తం నారాయణపేటకు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు విరగొట్టి ఇంట్లో ఉన్న రూ.30 వేల నగదు, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి ఎంపిక

మద్దూరు: పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు శ్రీ మేధ ట్రస్టు చేయూతనిస్తోంది. మండల కేంద్రంలో ఆసంస్థ నిర్వహించిన పరీక్షలో బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన భరత్‌కుమార్ గౌడ్ ఎంపికయ్యాడు.

ట్రాక్టర్ బోల్తా

మక్తల్: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన మండలంలోని దండు గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. మంతన్‌గోడ్ గ్రామం నుంచి రుద్ర సముద్రం వద్ద ఉన్న గోదాంకు వరిధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. డ్రైవర్ మైనోద్దిన్ అప్రమత్తమై వెంటనే కిందకు దిగడంతో ప్రమాదం తప్పింది.

ఎరువుల తయారీ పరిశీలన

మక్తల్: మండలం గడ్డంపల్లి, ముస్టిపల్లి గ్రామాలను శనివారం ఎంపీడీఓ శ్రీధర్, జిల్లా స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ మాలిక్‌పాషా సందర్శించారు. ఈసందర్భంగా గ్రామాల్లో మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. ముస్టిపల్లిల్లో డంపింగ్ యార్డుల్లో ఎరువుల తయారీని పరిశీలించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

పాలిసెట్ ర్యాంకర్‌కు సన్మానం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన మంజుల పాలిసెట్‌లో 103 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 122వ ర్యాంకు సాధించింది. శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో మంజులను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అంబ్రేష్‌తో పాటు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నాగప్ప, వెంకటేష్, కిట్టు, మహాదేవ్, శివ, మహేష్, సురేష్, శ్రీను, వాసు, శివరాజ్, బస్వరాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మక్తల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పాండు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయీ బ్రాహ్మణులకు డబుల్ బెడ్‌రూంను ఇవ్వాలని కోరారు. కులవృతి చేస్తు మరణించిన వారికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల బీమా అందజేయాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, పట్టణ అధ్యక్షుడు నర్సిములు, రమేష్, శివరాములు, ఆంజనేయులు, అశోక్, చిట్యాల రాజు, చిరంజీవి, కిష్టప్ప, భాను, కర్నెపాండు, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ రేట్లు పెంచాలి

నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు గిట్టుబాటు అయ్యే విధంగా కూలి రేట్లు పెంచాలని ఏఐపీకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కొల్లంపల్లి, లింగంపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, వెంకట్రాములు, హాజిమలాంగ్, చెన్నప్ప, పరశురాములు, బాలకృష్ణ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



మక్తల్: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ సీతయ్య అన్నారు. శనివారం పట్టణ సర్కిల్ కార్యాలయంలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా, జైలుశిక్ష విధిస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి ప్రమాదాలబారిన పడితే కుటుంబాలు చిన్నాభిన్నాం అవుతాయని వివరించారు. కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని మద్యానికి దూరంగా ఉండాలని కోరారు.

మద్దూరు: ఆటో డ్రైవర్లు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ శీనయ్య అన్నారు. మండలంలోని రావులపల్లి చౌరస్తాలో రోడ్డు ప్రమాదాల నివారణ– ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలుపరాదాని, ఆటో వెనుకాల రేడియం స్టిక్కర్లు వేసుకోవాలని పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు.

కోస్గి: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు. తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైతే కుటుంబసభ్యులు రోడ్డున పడుతారని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో సెల్‌ఫోన్ల పట్టివేత

నారాయణపేట రూరల్: ఇటీవల నూతనంగా అందుబాటులోకి వచ్చిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) టెక్నాలజీని ఉపయోగించి శనివారం జిల్లాలో మిస్ అయిన రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు పట్టుకున్నారు. సీఐ రవిబాబు తెలిపిన వివరాలు... మండలంలోని కోటకొండకు చెందిన తిర్మలేష్, నారాయణపేట పట్టణంలోని చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది శ్రీకాంత్‌కు చెందిన ఫోన్లు పోగొట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ–2 చంద్రశేఖర్ ఐటీ సిబ్బంది సహకారంతో సీఈఐఆర్ టెక్నాలజీతో కనుగొన్నారు. అనంతరం వారికి సీఐ చేతులమీదుగా అందించారు.